ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే క్రమంలో కిస్మత్‌పూర్, కోకాపేట ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ స్కూల్‌లను ప్రారంభిస్తున్నామని వాటికి ఇన్‌స్ట్రక్టర్‌లు, ఆయాల పోస్టులకు స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని మండల విద్యాశాఖాధికారి సునిల్‌కుమార్ తెలిపారు. నాలుగు సంవత్సరాల వయసు నిండిన పిల్లలకు ఈ పాఠశాలలో విద్యాబోధన చేయాల్సి ఉంటుందన్నారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్ చదవిన మహిళలు, ఆయా పోస్టులకు 7వ తరగతి చదవిన మహిళలు కిస్మత్‌పూర్‌లోని మండల విద్యావనరుల కేంద్రంలో సెప్టెంబర్ 6వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

నిబద్ధతతో పనిచేసే వారికి గుర్తింపు



ఉద్యోగ విరమణ చేసిన వారిని సన్మానిస్తున్న రిజిస్ట్రార్

ఏజీవర్సిటీ: ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తరువాత కష్టపడి నిబద్ధతతో పనిచేసిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ విద్యాసాగర్ అన్నారు. వర్సిటీలో అసిస్టెంట్ కంప్ట్రోలర్‌లుగా పని చేస్తున్న ఎం.సుజాత, హెచ్. రాజశ్రీ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జాయింట్ రిజిస్ట్రార్ శివాజీ, అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ప్రీ ప్రైమరీ తరగతులు



శంకర్ రాథోడ్ ఎంఈవో

అత్తాపూర్: నాణ్యమైన విద్య అందరికీ అందించే క్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించనున్నట్లు రాజేంద్రనగర్ మండల విద్యా శాఖాధికారి శంకర్ రాథోడ్ తెలిపారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ మండలంలో ఎంపిక చేసిన శివరాంపల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, వాంబే కాలనీ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తామని వివరించారు. నాలుగు సంవత్సరాలు ఆపై వయస్సున్న చిన్నారులు ప్రీ ప్రైమరీలో ప్రవేశానికి అర్హులన్నారు. ప్రతి పాఠశాలలో ఒక ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయాను నియామకానికి ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో వెల్లడించారు. దరఖాస్తులను రాజేంద్రనగర్ మండల విద్యా శాఖ కార్యాలయంలో స్వయంగా సమర్పించాలన్నారు. వివరాలకు ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఫిరంగినాలా.. ఎన్నాళ్లిలా?

నాలాకు పూర్వ వైభవం వచ్చేనా?

- కనుమరుగవుతున్న నాలా భూములు
- సంరక్షణలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం
- అధికారుల తీరుపై నిరసన వెల్లువ



పెరిగిన పిచ్చిమొక్కలు

శాస్త్రిపురం: పురాతన ఫిరంగి నాలాకు పూర్వవైభవాన్ని కల్పించే విషయంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. అధికారుల వైఖరి.. ప్రజాప్రతినిధులు తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయంటూ పరీవాహన ప్రాంతాల ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. రాజేంద్రనరగ్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల ప్రజలకు దశాబ్దాల క్రితం సాగు, తాగునీరు అందించిన ఫిరంగినాలా ఆక్రమణలబారినపడి క్రమేపీ కనుమరుగవుతోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటలు, నాలాలను సంరక్షిస్తామని చెబుతున్నా అది అందని ద్రాక్ష చందాన తయారవడం ఖాయమనేది బహిరంగ రహస్యమంటూ వ్యాఖ్యానాలు ఉన్నాయి.

- సులేమాన్‌నగర్ డివిజన్‌లోని ఫిరంగినాలాను సంరక్షించే విషయంలో సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాలా ఆక్రమణలపై పలుమార్లు ప్రజలు, కొందరు ప్రజాప్రతినిధులు ఆందోళనలు చేసిన సంఘటనలూ లేకపోలేదు. గతంలో అప్పటి నగర మేయర్ మాజిద్ హుస్సేన్ ఫిరంగినాలాను రక్షించి పూర్వవైభవం తీసుకురావాలని కొంత నిధులను కూడా కేటాయించారు. ఇప్పటి వరకు అధికారులు నాలా సంరక్షణ చర్యలు తీసుకోలేదు. పలుమార్లు ఫిరంగినాలాలో పేరుకుపోయిన పూడికను తొలగించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- నాలాకు రెండు వైపులా రక్షణ గోడలను నిర్మించిన అధికారులు నాలాలో మాత్రం పూడిక తీయలేదు. గడచిన ఐదేళ్లలో ఫిరంగినాలాలో పూర్తి స్థాయిలో పూడిక తీసిన దాఖలాలు లేవు. నాలా మొత్తం చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాలాలో మురుగునీరు, వర్షపు నీరు చేరుతోంది. సాఫీగా పల్లపు ప్రాంతాలకు వెళ్లలేక లోతట్టు ప్రాంతాలను నీరు ముంచెత్తుతోంది. నాలాలో పెద్ద ఎత్తున మట్టి పేరుకుపోయినందునే వరద ఎటూ వెళ్లడం లేదని స్థానికులు చెబుతున్నారు. చాలా చోట్ల నాలాలో నిర్మాణ వ్యర్థాలను వేస్తున్నందున నాలా రూపు రేఖలు మారిపోతున్నాయి.
- చింతల్‌మెట్ ప్రాంతంలో నాలాలో చెత్త వేయకుండా అధికారులు కంచె ఏర్పాటు చేసినా అది మంచి ఫలితాలను ఇవ్వలేక పోతోంది. చాలా ప్రాంతాల్లో కొందరు కంచె తొలగించి మరీ వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు.
- ఎంఎం పహాడీ లాంటి చోట్ల నాలాలో నీరు వెళ్లలేక రహదారులపైకి చేరుతున్నది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి ఫిరంగినాలాలో పూడిక తీసి... అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతులు చేసి నాలాకు పూర్వవైభవం తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పేరుపోయిన మట్టి కుప్పలు



ఆక్రమణలతో ఎంఎం పహాడీ వద్ద ఇలా...



నాలాలో ప్రవహిస్తున్న మురుగు నీరు

చెరువులకు తగ్గిన వరద

- తెరచుకున్న సర్వీసు రోడ్లు
- తగ్గిన నీటి విడుదల

మణికొండ: జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్‌లకు నీటి ప్రవాహం తగ్గింది. దాంతో శనివారం ఉదయం గండిపేటకు తెరచిన 8 గేట్లను నాలుగు గేట్లకు తగ్గించారు. పై నుంచి 800 క్యూసెక్కుల వరద వస్తుండగా కిందకు నాలుగు గేట్లు రెండు అడుగుల మేర ఎత్తి 884 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులకు గాను 1788.85 అడుగుల నీటి మట్టం ఉందని జలమండలి డీజీఎం నరహరి తెలిపారు. హిమాయత్ సాగర్‌కు సైతం వరద తగ్గిపోవటంతో ఒక గేటును మూడు అడుగుల ఎత్తు ఎత్తి 991 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. పై నుంచి 750 క్యూసెక్కుల వరద వస్తుందని, పూర్తి స్థాయి నీటి మట్టం 1763.50 అడుగులకు గాను ప్రస్తుతం 1762.20 అడుగుల మట్టం నీరు ఉందన్నారు.

తెరచుకున్న సర్వీసు రోడ్లు..

గండిపేట చెరువుకు శుక్రవారం 8 గేట్లను ఎత్తి 4 వేల క్యూసెక్కులకు పైగా నీటిని కిందకు వదలటంతో నార్సింగి నుంచి పోలీస్ అకాడమీకి, పోలీస్ అకాడమీ నుంచి నార్సింగికి వచ్చే సర్వీసు రోడ్లను మూసివేసిన విషయం తెలిసిందే. సర్వీసు రోడ్లతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు నార్సింగిలో దిగే 18ఏ టోల్ గేటును సైతం మూసివేశారు. శనివారం వరద ఉధృతి తగ్గటంతో వాటిని ట్రాఫిక్ పోలీసులు పునరుద్ధరించినట్టు ట్రాఫిక్ ఎస్ఐ రాజేశ్‌గౌడ్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

బండ్లగూడ: ప్రజలు తాము ఉంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. 18వ డివిజన్‌లోని రాములు కాలనీలో తడి, పొడి, హానికారక చెత్తతో ఉత్పన్నమయ్యే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే భూగర్భ మురుగు నీటి కాలువలను శుభ్రం చేసే ప్రక్రియను ఆయన పరిశీలించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.కుమార్, జి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న బెలూన్ వినాయకుడు



మణికొండ: వినాయక చవితి సందర్భంగా రకరకాల వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి భక్తులు తమ ప్రత్యేకతను చాటుకుంటారు. అందులో భాగంగా మణికొండ మున్సిపాలిటీ, చిత్రపురి కాలనీ ప్రవేశంలో ఏకంగా 108 అడుగుల ఎత్తు ఉన్న బెలూన్ వినాయకుడిని ఏర్పాటు చేశారు. దాంతో అది చిత్రపురి కాలనీ వాసులతో పాటు చుట్టు పక్కల ఉన్న కాలనీల వారిని ఆకట్టుకుంటున్నది. దాన్ని చూసేందుకు భక్తులు తరలివెళ్తున్నారు. చిత్రపురి హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో దాన్ని ఏర్పాటు చేసినట్టు కాలనీవాసులు తెలిపారు. వినాయక నవరాత్రుల వరకు దాన్ని అలాగే ఉంచుతామని అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు.

నిమజ్జనోత్సవం.. నిఘానేత్రం!

- రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో 1139 విగ్రహాలు
- మండపాలు, నిమజ్జనానికి పటిష్ట పోలీసు బందోబస్తు
- రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్



టి.శ్రీనివాస్, ఏసీపీ, రాజేంద్రనగర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు (ఏసీపీ) పరిధిలో మొత్తం 1139 గణనాథుల ప్రతిమలను ఏర్పాటు చేసినట్లు ఏసీపీ టి.శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ... మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన గణనాథుల మండపాలకు ఆన్‌లైన్ ద్వారా అనుమతులను ఇచ్చామన్నారు. సైబరాబాద్ కమిషనర్‌తో పాటు రాజేంద్రనగర్ డీసీపీ ఆదేశాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మండపాలను పరిశీలిస్తున్నామన్నారు. రాజేంద్రనగర్ స్టేషన్ పరిధిలో 441, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో 429, అత్తాపూర్ స్టేషన్ పరిధిలో 269 మండపాలు ఉన్నాయన్నారు. సెక్టార్ల వారీగా మండపాలను నిత్యం సెక్టార్ ఎస్ఐ, బీట్ కానిస్టేబుళ్లు తనిఖీలు చేస్తున్నారన్నారు. రాత్రి సమయంలో మండపాలను తమ పెట్రోలింగ్ సిబ్బంది పరిశీలిస్తూ మండపాల నిర్వాహకులకు అందజేసిన తనిఖీ పుస్తకాల్లో సంతకాలు చేస్తున్నారన్నారు.

- గణనాథుల నిమజ్జన ఊరేగింపు సందర్భంగా ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామని ఏసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐదు, ఏడు, తొమ్మిదవ రోజుల్లో నిమజ్జనానికి పెద్ద ఎత్తున గణనాథులు రానుండటంతో ప్రధాన రహదారులపై బందోబస్తు, పోలీసు పికెట్‌లను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, ట్రాఫిక్ తదితర విభాగాల ఆధ్వర్యంలో ఊరేగింపుల రహదారిపై ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పత్తికుంట, పల్లెచెరువుకు అత్యధికంగా గణనాథుల ప్రతిమలు నిమజ్జనానికి వస్తాయని.. అందుకు అనుగుణంగా బందోబస్తు చర్యలను చేపట్టామన్నారు. నిమజ్జన కేంద్రాల వద్ద ప్రత్యేక గుడారాలను ఏర్పాటు చేసి పోలీసులను బందోబస్తు కోసం విధులను కేటాయించామన్నారు. ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ స్థాయి అధికారులు నిమజ్జన ప్రాంతాల్లో అందుబాటులో ఉంటారన్నారు.

డీజేలకు అనుమతి లేదు..

గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. డీజేలను ఏర్పాటు చేస్తే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కమిటీ నిర్వాహకులు, డీజే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. తమ సిబ్బంది ఎప్పటికప్పుడు ఊరేగింపు సరళిని పరిశీలిస్తారన్నారు. నిబంధనలు పాటించని వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఎలాంటి సమస్యలున్నా ఫిర్యాదు చేయండి..

గణేశ్ మండపాలతో పాటు ఊరేగింపులో ఎలాంటి సమస్యలున్నా.. మండపాల నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి మండపానికి బందోబస్తు బుక్‌లెట్‌లను అందించామన్నారు. బుక్‌లెట్‌లో పోలీసుల పేరు, వారి ఫోన్ నంబర్లు అందించినట్లు తెలిపారు.

చెరువును పరిరక్షించాలని వినాయకుడికి పూజలు



చెరువు చిత్రపటాన్ని వినాయకుడి వద్ద ఉంచి పూజలు చేసిన ప్రజలు

మణికొండ: మురికి నీటి నుంచి ముష్కి చెరువుకు విముక్తి కల్పించాలని, రికార్డుల్లో ఉన్న విధంగా 53 ఎకరాలను చెరువు భూమిని పరిరక్షించాలని, అందుకు సంబంధించి హెచ్ఎండీఏ, హైడ్రా, ఇరిగేషన్, మున్సిపాలిటీలకు శక్తిని ఇవ్వాలని వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని హాల్‌మార్క్ వినిసియా, మైహోం అవతార్ గేటెడ్ కమ్యూనిటీల ప్రజలు ఇటీవల ముష్కి చెరువులో చేరుతున్న మురికినీరు, దోమలు, చెరువు పరిధి తగ్గించటంపై పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా శనివారం చెరువు పక్కనే సంకటహర హనుమాన్ ఆలయ ఆవరణలో నెలకొల్పిన వినాయక విగ్రహం వద్ద చెరువు ఫొటోను ఉంచి దానిని పరిరక్షించాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. చెరువు చుట్టు పక్కల నివసిస్తున్న వారు దుర్గంధం, దోమల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేక మంది రోగాల బారిన పడుతున్నారని, వారి జీవన ప్రమాణాలను కాపాడాలని వేడుకున్నారు. వేద మంత్రాలతో ఆయా శాఖలకు శక్తి ఇవ్వాలని పూజలు చేశారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

ఏజీవర్సిటీ: విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలను ఎంచుకొని అందులో రాణించాలని.. వాటిలో ప్రతిభ చూపిన వారికి ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీపీ మాట్లాడుతూ... చదవుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్, ఏఎస్ఏ రామ్‌రెడ్డి, క్రీడల ఇన్‌చార్జీ సైదా నాయక్, పీడీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ప్రతిభకు పదును

బండ్లగూడ: క్రీడల ద్వారా మేధస్సు పెరుగుతుందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. భారత లెజెండరీ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చందం జయంతి సందర్భంగా శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ స్పోర్ట్స్ సూచనల మేరకు శనివారం కార్పొరేషన్ పరిధిలో వివిధ ఇండోర్, ఔట్ డోర్ క్రీడలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.



అలకాపూర్ టౌన్ షిప్‌లో...



అలకాపూర్ నక్షత్ర గేటెడ్ కమ్యూనిటీలో...



నార్సింగి ఆనంద పాయెట్రీ గేటెడ్ కమ్యూనిటీలో...

గణనాథుల పూజల్లో భక్తజనం

వినాయక నవరాత్రి ఉత్సవాలతో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మండపాలలో సందడి నెలకొంది. భక్తులు సామూహికంగా పూజలు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు వినాయక నవరాత్రి ఉత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. శనివారం పలు మండపాలలో అన్నదానాలను నిర్వహించటంతో పాటు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఐదు రోజులు పూజలు పూర్తి కావటంతో ఆదివారం పలు వినాయకులను నిమజ్జనాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. – మణికొండ



మణికొండ నవజ్యోతి యూత్ ఆధ్వర్యంలో



నార్సింగి హైట్స్‌లో...



మణికొండ క్వార్టర్స్‌లో...



నెక్నాంపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు



మైలార్‌దేవ్‌పల్లి మధుబన్ కాలనీలో...



హైదర్‌గూడ బాబు జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్



అత్తాపూర్‌లో ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు తదితరులు



మణికొండ షిరిడీసాయినగర్ స్వర్ణ ప్యాలెస్‌లో...



బండ్లగూడ దుర్గాదేవి కాలనీలో...

అన్నదానం.. పుణ్యకార్యం

- గణేశ్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు
- ప్రముఖుల రాకతో సందడిగా మండపాలు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వాహకులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. గతంలో పెద్ద మండపాల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది రెండో రోజు నుంచే అపార్ట్‌మెంట్‌లు, బస్తీలు, కాలనీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఎక్కడ చూసినా మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్నదాన కార్యక్రమాలు కనిపిస్తున్నాయి. మండపాల నిర్వాహకులు ఈ అన్నదాన కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖులను ఆహ్వానిస్తూ పెద్ద ఎత్తున చేపడుతున్నారు. దీంతో మండపాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రెండు రోజుల పాటు వర్షాలు ఉండటంతో శుక్ర, శనివారాల్లో ఈ అన్నదాన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు.

అడవి పండ్లతో పోషకాహార భద్రత

- ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ దండా రాజిరెడ్డి
- 'ఆదరణ కరువైన అడవి పండ్లు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ, అధికారులు

ఏజీవర్సిటీ: భవిష్యత్తులో పోషకాహార భద్రతకు అడవి పండ్లు మంచి ఆహారం కానున్నాయని ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. శనివారం ఉద్యాన విశ్వవిద్యాలయంలో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ ఎం.పద్మయ్య రచించిన ఆదరణ కరువైన అడవి పండ్లు అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ... అడవిలో దొరుకుతున్న వివిధ రకాల పండ్లలో మంచి పోషకాహారాలు ఉంటాయన్నారు. ఈ అడవి జాతి పండ్లపైన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పరిశోధనలు చేపడతామని, అవసరమైతే వాటి నుంచి నూతన రకాలను అభివృద్ధి చేసేందుకు ఉద్యాన వర్సిటీ కృషి చేస్తుందని తెలిపారు. విలువైన ఈ అడవి పండ్ల మొక్కలను సేకరించి రైతులకు అందజేస్తామన్నారు. రైతులు తమ క్షేత్రాల్లో సాగు చేసేందుకు అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఐదు ఎకరాల్లో అడవి పండ్ల మొక్కలను నాటుతామన్నారు. అటవీశాఖ అధికారి డాక్టర్ ప్రయాంక వర్గీస్ మాట్లాడుతూ... అడవి పండ్ల చిత్రాలను ప్రధాన పార్కుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. పుస్తక రచయిత పద్మయ్య మాట్లాడుతూ... అరుదైన పోషక విలువలను ఇచ్చే గొప్ప వనరులుగా అడవులను పరిచయం చేయాలనే పుస్తకాన్ని రచించానన్నారు. నబార్డ్ రిటైర్డ్ సీజీఎం బి.మోహనయ్య, ఐఐటర్ డైరెక్టర్ ఆర్కే మాదూర్, ఉద్యాన విశ్వవిద్యాలయం మాజీ వీసీ నీరజ ప్రభాకర్ డీన్ ఆఫ్ హార్టికల్చర్ చీనా నాయక్, డీన్ ప్రశాంత్, పిడగం సైదయ్య, డాక్టర్ అనిత, నిఖిల్, యాదగిరి పాల్గొన్నారు.